సమస్యలు తీరేదెలా..?

- గ్రీవెన్స్‌లో ప్రజల గోడు
- వివిధ సమస్యలపై 130 అర్జీలు
- స్వీకరించిన కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్: 'కన్న కొడుకులు పట్టించుకోవడం లేదని వృద్ధ దంపతులు.. రైస్ మిల్లు నిర్మాణంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు.. పింఛన్ ఇప్పించాలని వితంతులు.. కాస్తులో ఉన్నా పట్టా చేయడం లేదు.. అధికారులు భూసర్వే రిపోర్ట్ ఇవ్వడం లేదని కొందరు' సమస్యలను ఏకరువు పెట్టారు. కలెక్టరేట్‌కు రావడం తప్ప సమస్యలు తీరడం లేదని వాపోయారు.

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 130 అర్జీలు వచ్చాయి. వాటిలో రెవెన్యూ భూ సమస్యలకు సంబంధించి 107, మున్సిపల్, పోలీసు శాఖ మూడు చొప్పున, విద్యుత్, ప్రభుత్వాస్పత్రి, ఇరిగేషన్, ఆర్డీఓ పరిధిలో రెండు చొప్పున, ఇతర శాఖలకు ఒక్కొక్కటి వచ్చాయి.

వాటిని పరిశీలించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా.. తమ పరిధిలో పరిష్కారమయ్యే వాటిని వెంటనే పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధ దంపతులు కొప్పురవు బాపిరెడ్డి, శంకరమ్మ స్వగ్రామం బచ్చన్నపేట మండలం కొన్నె. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. తాత ముత్తాలు సంపాదించిన 40 ఎకరాల భూమిని ఇద్దరి కుమారులకు చెరిసగం పంచి ఇచ్చారు. ఉన్న బంగారం కూతుళ్లకు ఇచ్చి వివాహం చేశారు. కొడుకులు తమ అవసరాలకు భూములు అమ్ముకున్నారు. ఉన్న ఇంటి నుంచి వెళ్లగొట్టగా చిన్న రేకుల షెడ్డులో తల దాచుకుంటున్న వృద్ధ దంపతులు అనారోగ్య సమస్యతో మందులకు కూడా చేతిలో చిల్లిగవ్వలేక తల్లడిల్లుతున్నారు. న్యాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. విన్నవించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అధికారులు

వితంతు పింఛన్ ఇప్పించాలి



జనగామ పట్టణ పరిధి వివిధ వార్డుల్లో ఉంటున్న 25 మంది మహిళలు తమకు వితంతు పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కాయకష్టం చేసుకుని పిల్లలను పోషించుకుంటున్నామని, ఏలాంటి ఆసరా లేదని ఆదుకోవాలని కోరారు.

రైస్ మిల్లు నిర్మాణం ఆపాలి



గ్రామ పరిధి 40 సర్వేనంబర్‌లో సంబంధిత భూయజమాని పొలాల మధ్య రైస్ మిల్లు నిర్మిస్తున్నాడు. దీంతో తమకు ఉన్న కొద్దిపాటి భూమి సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. పంటలు, భూములు దెబ్బతింటాయి. పక్కనే ఉన్న కాల్వలో వ్యర్థాలు చేసి నీరు కలుషితం అవుతుంది. మిల్లు నిర్మాణం నిలిపివేయాలని కలెక్టర్‌కు వినతి అందజేశాడు.

-ఎల్లబోయిన యాదగిరి, అడవికేశ్వాపూర్(జనగామ)

భూమి పట్టా చేయడం లేదు



గ్రామంలోని 15 సర్వే నంబర్‌లో 31 గుంటల భూమి మా తాత కాసోజు విశ్వనాథం పేరు మీద ఉంది. వారసత్వంగా వస్తున్న భూమిని సాగు చేసుకుంటున్నాము. మా తండ్రి కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన పేరు మీద ఉన్న భూమిని తనకు పట్టా చేయమగా పెద్ద మనుషుల సమక్షంలో ఇస్తామని చెప్పిన పాలివారు అక్రమంగా పట్టా చేసుకున్నారు. సర్వే చేపట్టి తాత భూమిని వారసత్వ పట్టా చేయాలని కలెక్టర్‌ను కోరారు.

-కాసోజు వినోద్‌కుమార్, కల్లెం(లింగాలఘణపురం)

భూసర్వే రిపోర్ట్ ఇవ్వడం లేదు



మా నాన్న నాగపురి వేణుకుమార్ పేరు మీద గ్రామంలోని 368ఏ సర్వే నంబర్‌లో 6 ఎకరాల 18 గుంటలు, 363ఏలో 3 ఎకరాల 24 గుంటలు, 364ఏలో 2 ఎకరాల 30 గుంటల భూమి ఉంది. ఆ భూమిని 2003లో కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్నాము. భూమి హద్దులు, హక్కులు ఉండేలా సర్వే చేయాలని కోరగా అధికారులు చేపట్టారు. సంబంధిత రిపోర్ట్ ఇవ్వకుండా ఏళ్ల తరబడి తిప్పుకుంటున్నారు. రిపోర్ట్ ఇప్పించాలని మురళీకృష్ణ వినతిపత్రం అందజేశాడు.

- ఎన్.మురళీకృష్ణ, పెద్దపహాడ్(జనగామ)

అల్పాహారం బిల్లు రాలేదు



స్థానిక మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం పెట్టడానికి సంఘం ఆధ్వర్యంలో రూ.1,48 000 వెచ్చించాం. అక్టోబర్ నుంచి మార్చి వరకు బిల్లు రాలేదు. అప్పులు తెచ్చి వండిపెట్టాం. బిల్లురాక ఇబ్బందులు పడుతున్నామని గ్రామైక్య సంఘం సభ్యులు లత, దేవి, రమ్య, సమ్మక్క కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

- బచ్చన్నపేట గ్రామైక్య సంఘం సభ్యులు

తహసీల్‌లో వినతుల స్వీకరణ

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని తహసీల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ మోసిన్ ముజ్తాబా దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో రెవిన్యూ సమస్యలపై ప్రజల నుంచి ఎనమిది విజ్ఞప్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రతి సోమవారం తహసీల్ లో ప్రజావాణి నిర్వహిస్తామని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. నాయబ్ తహసీల్దార్ శంకర్ ఉన్నారు.

ప్రతీ సోమవారం..

లింగాలఘణపురం: ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించబడునని తహసీల్దార్ వినయలత తెలిపారు. అన్ని శాఖల అధికారులు తహసీల్దార్ కార్యాలయంలోనే అందుబాటులో ఉంటారని ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఒక దరఖాస్తు

చిల్పూరు: తహసీల్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మండల కేంద్రానికి చెందిన మహిళ తనపేరు ను రేషన్ కార్డులో నుంచి తొలిగించాలంటూ తహసీల్దార్ సరస్వతికి దరఖాస్తు అందజేసింది. మొత్తంగా ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పాలకుర్తి టౌన్: తహసీల్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌లో రెవిన్యూ సమస్యలపై రెండు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

మహిళా సాధికారతకు కృషి

దేవరుప్పుల : మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ, మాలతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సైకి సన్మానం



కొడకండ్ల: స్థానిక ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన చింత రాజును సోమవారం వర్తక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్సైని వారు సన్మానించగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్సై కోరారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు దామెర సతీష్‌గుప్త, నాయకులు గుండా పూర్ణచందర్, బొమ్మరబోయిన కృష్ణ, గట్టు వెంకన్న, కోల మహేందర్, బుక్క రాజేష్, నవీన్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఇప్పగూడెంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన పల్లె వసంత-సత్యనారాయణగౌడ్ దంపతుల కుమారుడు పల్లె పవన్‌గౌడ్ ఎస్సైగా ఎంపికై శిక్షణ పూర్తి చేసి త్వరలో సివిల్ ఎస్సైగా విధుల్లో చేరనున్న సందర్భంగా గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని ఎల్లమ్మగుడి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో శాలువాలతో ఆయనను సత్కరించారు. కులపెద్దలు చట్ల యాదగిరి, చట్ల యాకయ్య, రాములు, రాజు, పల్లె లక్ష్మీనారాయణ, మందపురం ఎల్లగౌడ్, పల్లె రవీందర్, పల్లె నరేందర్, పొగాకు సోమయ్య, చట్ల సురేష్, అయ్యప్పశ్రీను, కుమారస్వామి, గంగపురం యాదగిరి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 1.05 లక్షల విరాళం



నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయుల కాలంనాటి అతిపురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోగా గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాగా, దుర్గామాత దేవాలయ కమిటీ అధ్యక్షుడు బూస అంజయ్య రూ. 1,00,016, ముక్కెర మహేందర్ రూ. 5,116 సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు. జంగిటి అంజయ్య, ప్రజ్ఞాపురం శ్రీధర్, కొండ బాలయ్య, శివరాత్రి మహేష్, మేకల పెద్దాపురం పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

నర్మెట: మండలకేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ నిధులు రూ.4.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను డీటీడీఓ ప్రేమ కళ సోమవారం ప్రారంభించారు. హెచ్‌ఎం బి.కిష్ట, ఉపాధ్యాయులు భూక్య వాసు, డి. రాజు, లచ్చిరాం, హెచ్‌డబ్ల్యూఓ పద్మ, జ్యోతి, రజని, హర్సింగ్, సజన్‌లాల్ గురు పాల్గొన్నారు.

పల్లెలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

రఘునాథపల్లి: మండలంలోని అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్ఐ మండల కమిటీ నాయకులు సోమవారం జనగామలో ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మెనేజర్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పొదల లవకుమార్ మాట్లాడుతూ గతంలో మంగళిబండతండా-మచ్చుపహడ్, వెల్ది-మోడల్ స్కూల్ రూట్‌లో బస్సు సర్వీసులు నడిచేవని, వాటిని రద్దు చేయడంతో విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని కోరగాడీఎం సానుకూలంగా స్పందించి రూట్ మ్యాప్ పరిశీలించి కొన్ని గ్రామాలకు బస్సు సర్వీసులు నడుపుతామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛతా హీ సేవ'



జనగామ: పట్టణం హైదరాబాద్ రోడ్డులోని ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో సోమవారం కరస్పాండెంట్ చిర్ర ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పురపాలిక అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, 20వ వార్డు కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం, వార్డు ఆఫీసర్ మల్లిగారి మధు ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బచ్చన్నపేట: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. సోమవారం స్వచ్ఛతా హీ మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జీపీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మూడు నెలల్లో బ్రిడ్జి పూర్తి చేయాలి

లింగాలఘణపురం: పటేల్‌గూడెం-కుందారం రోడ్డుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. కుందారం, కిష్టగూడెం, చీటూరు, నాంచారిమడూరు గ్రామాల ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారని, తెగిపోయిన అప్రోచ్ రోడ్డును మరమ్మతు చేసి బస్సు ప్రయాణానికి అనుకూలంగా చేయాలని చెప్పారు. అలాగే నెల్లుట్ల చెరువు మత్తడి ఎక్కువ కావడంతో శ్మశాన వాటిక వద్ద రోడ్డు ధ్వంసమై రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఇక్కడ తాత్కాలిక రోడ్డు పనులు వారంలో పూర్తి చేయాలని పీఆర్, నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దిలీప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్, మల్లారెడ్డి, సదానందం, ఆంజనేయులు, బాబు, నాగరాజు, సంపత్, అనిల్, నాగేందర్ పాల్గొన్నారు.



పటేల్‌గూడెం వద్ద బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జీపీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

తరిగొప్పుల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల ఆర్థిక, మానసిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ పిలుపు మేరకు సోమవారం విరామం సమయంలో ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డికి, ఎంపీఓ మాలతికి వినతిపత్రం అందజేశారు. భూక్య లింగం, కంకటి రవీందర్, భాగ్యలక్ష్మి, హరిత, మహేందర్, భూక్య రాజేందర్, రత్న, మాధవి ఉన్నారు.

నిధులు విడుదల చేయాలి

నర్మెట: నిధుల కొరతతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటు పడటమేకాకుండా పంచాయతీల నిర్వహణ కష్టంగా మారిందని మండల కార్యదర్శులు ఎంపీడీఓ బి.అరవింద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. దామెర వంశి, కందకట్ల శ్రీధర్, చాడ గొండ అనిల్, శివరాత్రి యాకూబ్ , అనందాసు కళ్యాణి, ఎదునూరి సుజాతతోపాటు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడి మృతి

- బొట్ల శ్రీనివాస్‌కు పలువురి సంతాపం

జనగామ రూరల్: సీపీఎం సీనియర్ నాయకుడు, కార్మిక ఉద్యమ నేత, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొట్ల శ్రీనివాస్ సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అధ్యక్షతన సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గొల్లపల్లి నాగయ్య మాట్లాడుతూ అంకితభావంతో ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న గొప్ప కార్మిక నాయకుడు శ్రీనివాస్ అని అన్నారు. జిల్లాలో జరుగుతున్న భూ పోరాటాల్లో ముఖ్య పాత్ర పోషించి ప్రజల్లో తనదైన ముద్రను వేసుకున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీపీఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తిప్పారపు లక్ష్మణ్, ప్రముఖ విద్యావేత్త జాన్, ప్రముఖ వైద్య నిపుణుడు కృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు ఊడుగుల కిష్టయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్వీ రమ, సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డిలు మాట్లాడారు. సంతాప సభలో నాయకులు ఎస్ వాసుదేవ రెడ్డి ఎంవి రమణ, ఎండీ దస్తగిరి, ఎండీ జహంగీర్, వెంకటేష్, ఆర్ రాజు, అహల్య, ఆర్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



అంతిమయాత్రలో కార్యకర్తలు, అభిమానులు

నివాళి

జనగామ: సీపీఎం సీనియర్ నాయకుడు బొట్ల శ్రీనివాస్ అకాల మరణం తీవ్రంగా కలచి వేసిందని మాజీ మున్సిపల్, మార్కెట్ చైర్మన్లు వూమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్ అన్నారు. సోమవారం శ్రీనివాస్ మృతి చెందగా, ఆయన మృతదేహంపై వారు పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట జాయ మల్లేశ్ ఉన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



రఘునాథపల్లి: పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం తీసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఇబ్రహీంపూర్ హైస్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి అన్నారు. సోమవారం మండలంలోని ఇబ్రహీంపూర్ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్త హీనతను నివారించేందుకు అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న బలవర్ధకమైన ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి టీచర్లు పోషకాలతో కూడిన పలు రకాల ఆహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహ, అంగన్‌వాడీ టీచర్లు హేమలత, రాజమణి, మంజుల, ప్రేమలత, ఆశ కార్యకర్త నాగలక్ష్మి పాల్గొన్నారు.

'ఉక్కుపాదం మోపితే బెదరరు'

దేవరుప్పుల: రాజకీయ ఆధిపత్యం కోసం ఉద్యమాల గడ్డలో ప్రతిపక్షాలను అణిచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగంతో ఉక్కుపాదం మోపితే ఎవరూ బెదరరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల నియోజకవర్గంలో భావస్వేచ్ఛ ప్రకటనకు విఘాతం కలిగించేలా కక్ష్యపూరిత చర్యలతో పోలీసులచే అక్రమ కేసులు పెడుతున్న తీరును తీవ్రంగా ఖండించారు. చింత సృజన్‌కుమార్, బాగాల నవీన్‌కుమార్‌రెడ్డి, మండల నాయకులు గోలి పెద్ద ఉప్పల్‌రెడ్డి, అజయ్‌నాయక్, శ్రీను, అన్వేష్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలి

స్టేషన్‌ఘన్‌పూర్/దేవరుప్పుల/తరిగొప్పుల/లింగాలఘణపురం/చిల్పూరు/జఫర్‌గఢ్: తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును యధాతథంగా కొనసాగించాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పార్శి కమల్‌కుమార్ గుప్తా కోరారు. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును అన్ని రాజకీయ పార్టీలు అంగీకరిస్తే మార్పు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని ఖండిస్తూ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఆర్యవైశ్యులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యధాతథంగా ఉంచాలని నినాదాలు చేశారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి జైన రమేష్, కోశాధికారి ఐత బుచ్చిబాబు, నాయకులు జొన్నల రాజేశ్వరరావు, గన్ను నర్సింహులు, పార్శి కృష్ణారావు, పాలకుర్తి సోమశేఖర్, నాగబండి వెంకట్రామనర్సయ్య, కౌడ లక్ష్మీనారాయణ, పార్శి రంగారావు పాల్గొన్నారు. అలాగే పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సంఘం నాయకులు దేవరుప్పుల, చిల్పూరు, పాలకుర్తి, తరిగొప్పుల, జఫర్‌గఢ్‌లలో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో బుక్క రామయ్య, వనమాల శ్రీనివాస్, ఇరుకుల శ్రీనివాస్, జిడిగం భిక్షపతి, బెజుగం లక్ష్మీనారాయణ, మంతెన లవన్‌కుమార్, మారం లింగమూర్తి, చిదర జగదీష్, భోనగిరి రంగయ్య,దారం అశోక్, రామకృష్ణ,చిట్టిమళ్ల కృష్ణమూర్తి, రేవూరి రమేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

తరిగొప్పుల: చదువు ఒక్కటే విద్యార్థికి పరమావధి కాదని, క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం కలుగుతుందని అప్పుడే విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకోగలడని మండల నోడల్ ఆఫీసర్ నెల్లుట్ల జానకి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా ఆమె ప్రారంభించారు. మండల స్థాయి అండర్-14, అండర్-17 విభాగంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో ప్రతిభ కనబరచిన బాలబాలిక క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి, హెచ్‌ఎం బానోతు రవీందర్,పంచాయతీ కార్యదర్శి బండి భాగ్యలక్ష్మి, చిరంజీవులు, అమర్నాథ్, జోసఫ్ బేబి పాల్గొన్నారు.



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎన్‌ఓ జానకి

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

స్టేషన్‌ఘన్‌పూర్: హైదరాబాద్‌లోని త్రిదండి చినజీయర్ స్వామి ఆశ్రమంలో ప్రజ్ఞావికాస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన శ్రీతేజస్ హైస్కూల్ విద్యార్థిని బత్తిని సౌమ్య(10వ తరగతి) పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ పెసరు సంజీవరెడ్డి తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం హైదరాబాద్‌లోని చిన్నజీయర్ స్వామి ఆశ్రమంలో నిర్వహించిన పోటీల్లో సౌమ్య పాల్గొని ప్రతిభ కనబరిచిందన్నారు. కాగా, సౌమ్యకు అతిథులు స్వామి, ప్రజ్ఞావికాస్ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పప్పు వెంకట్‌రెడ్డి చేతులమీదుగా రూ.6వేలు నగదు, ప్రశంసపత్రం అందించినట్లు తెలిపారు. సౌమ్య రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడంపై కరస్పాండెంట్, ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షుడు పెసరు సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.




బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

స్నేహితుడి కుటుంబానికి చేయూత



రఘునాథపల్లి: మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు చేయూత అందించి ఔదార్యం చాటారు. మండలంలోని మండెలగూడెం గ్రామానికి చెందిన గాదె నర్సింగం ఈ నెల 15వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. సమాచారం తెలుసుకున్న ఖిలాషాపూర్ 1996-97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి స్నేహితులు సోమవారం మండెలగూడెం చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారు జమ చేసిన రూ.80 వేలు తపాలా కార్యాలయంలో స్నేహితుడి కూతురు రవళి పేర సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ఫిక్స్ డిపాజిట్ చేశారు. అట్టి పత్రాలు కుటుంబ సభ్యులకు అందజేసి దాతృత్వం చాటారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని స్నేహితులు భరోసా ఇచ్చారు.

గుండెపోటుతో ఎంఎన్‌ఓ మృతి



కృష్ణ (ఫైల్)

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధుల్లో ఉండగా ఎంఎన్‌ఓ నార్ల కృష్ణ (58) సోమవారం గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది బాధిత కుటుంబాని పరామర్శించి సంతాపం తెలిపింది.

సంక్షిప్త సమాచారం

తెలుగు విశ్వవిద్యాలయానికి సోమనాథుడి పేరు పెట్టాలి

పాలకుర్తి టౌన్: తెలుగు విశ్వవిద్యాలయానికి తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడి పేరే పెట్టాలని సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక, వివిధ పార్టీల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో పాలకుర్తి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డాక్టర మార్గం లక్ష్మీనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్, కాంగ్రెస్ నాయకులు భూమ రంగయ్య, ఎడవెల్లి వెంకన్న, బజ్జూరి శ్యాంప్రసాద్, కరుణాకర్, వెంకన్న పాల్నారు.

'ఆరోపణలు సరికాదు'

బచ్చన్నపేట: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై కొందరు కావాలని ఆరోపణలు చేస్తున్నారని, అవి సరికాదని నియోజకవర్గ కిసాన్ సెల్ కోఆర్డినేటర్ జంగిటి నరేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో సీనియర్ నాయకులు వారి స్వార్థరాజకీయం కోసం పనికట్టుకుని ప్రతాప్‌రెడ్డిపై బురదజల్లుతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులను తెచ్చిన ఆయనను విమర్శించడం పనికిమాలిన చర్య అని అన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకొని నియోజకవర్గ అభివృద్ధికి కలిసి కట్టుగా పాటుపడాలన్నారు.

నియామకం



వంశి

నర్మెట: ఏబీవీపీ మండల కన్వీనర్‌గా అమ్మాపురానికి చెందిన పండ్ల వంశీని నియమిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ తోట రుతిక్ సాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ కార్యకర్త నిబద్ధతతో విద్యార్థుల సమస్యలపై గళమెత్తాలని, రానున్న రోజుల్లో ఏబీవీపీని సిద్ధాంతపరంగా మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. తన ఎంపికకు సహకరించిన నాయకులకు వంశి కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

కొడకండ్ల: మండలంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. రామన్నగూడెంలో సీనియర్ నాయకుడు బాబునాయక్ భార్య మంగమ్మ మృతి చెందగా దయాకర్‌రావు కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఏడునూతులలో కీసర సుభాష్‌రెడ్డి దశదిన కర్మకు ఆయన హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు..

కొడకండ్ల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబసభ్యులను పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించారు. రామవరంలో మాజీ సర్పంచ్ దుంబాల లక్ష్మణ్‌జీ, ఏడునూతులలో సుభాష్‌రెడ్డి, రంగాపురంలో పురుషోత్తంరెడ్డి, కొడకండ్లలో వెంకటయ్య కుటుంబసభ్యులను ఆమె పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సురేష్‌నాయక్, ప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నివాళి

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సహకర సొసైటీ మాజీ చైర్మన్ కూస భాస్కర్ తండ్రి కూస కొమురయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, బైరు భార్గవ్, గంగు కృష్ణమూర్తి, పులి గణేశ్, పసులాది వెంకటేష్, మొగులూరి యాకయ్య, యాకస్వామిలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తప్పవు

దేవరుప్పుల: సోషల్ మీడియాలో విద్వేషపూరితంగా రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, షేరింగ్ చేసే వ్యక్తులతోపాటు సదరు అడ్మిన్లపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన చిత్రాలు, వీడియోలను పోస్ట్ చేయొద్దని, వ్యక్తిగత దూషణకు దిగడం, వార్నింగ్‌లు ఇవ్వడంతోపాటు ప్రభుత్వ యంత్రాంగ పరమైన అనుమతులు లేని పోస్టులు, సమాజంలోని సంస్థ, వ్యక్తులపై తప్పుడు ఆరోపణలు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సుమోటోగా కేసులు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. ఏఎస్సై సదానందం ఉన్నారు.

ఆహ్వానం

పాలకుర్తి: ఈనెల 27న పాలకుర్తిలో నిర్వహించే కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన, జయంతి వేడుకలకు రావాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిని మండల లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ బాధ్యులు, పద్మశాలీల సంఘం సభ్యులు తొర్రూరులో సోమవారం ఆమెను కలిసి ఆహ్వానించారు. సుధాకర్, కృష్ణమూర్తి, సారయ్య, సుదర్శన్, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య ఉన్నారు.